క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార ప్రదర్శన

ప్రత్తిపాడు: పోషణ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని ప్రత్తిపాడు యాదవపాలెం, పాతమల్లాయపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార ప్రదర్శనలు నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువ ఉన్న ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలి, బాలామృతం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న టీహెచ్ఆర్‌లను ఆకర్షణీయంగా అలంకరించి ప్రదర్శించారు. పోషకాహారం తీసుకోవడంతో గర్భిణిలు, బాలింతలు, తల్లులకు కలిగే ప్రయోజనాలు, పుట్టే బిడ్డలకు చేకూరే లాభాలను మహిళలకు అంగన్‌వాడీ కార్యకర్తలు వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు జి.పరమేశ్వరి, బి.స్వాతి, జి.నాసరమ్మ, టి.జ్యోతిరాణి, వి.నగరాజకుమారి, ఎంఎస్‌కె.సింధూజ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ



ప్రత్తిపాడు: పెదనందిపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యాధికారులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. ఎన్‌సీడీ సీడీ 3.0 సర్వే వివరాలతో పాటు పీఎంజేఏవై, ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్, వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేల్లో అలసత్వం లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

ప్రత్తిపాడు: కాకుమాను మండలం కొండపాటూరు గ్రామంలో పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా వచ్చే భక్తులకు మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఉప్పుటూరి చిన్న రాములు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఛైర్మన్ ఉప్పుటూరి చిన్న రాములు మజ్జిగ, మంచి నీళ్ల ప్యాకెట్లతో పాటు భక్తులకు ప్రసాదాలను అందించారు. వేసవి కారణంగా సుదూర ప్రాంతాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా ఉండేందుకు వీటిని సమకూర్చామని దాతలు తెలిపారు.

విద్యార్థులకు వర్చువల్ ట్రైనింగ్ ప్రోగ్రాం



గుంటూరు రూరల్: చెబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో ఓరల్ డోసేజ్ టెక్నాలజీపై విద్యార్థులకు వర్చువల్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు విద్యా, పరిశ్రమల మధ్య ఉన్న అంతరాన్ని తొలగిస్తూ అవగాహన కల్పించామని అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో విద్యార్థులు పరిశ్రమకు సంబంధించిన అనేక కీలక అంశాలపై విలువైన అవగాహన పొందారన్నారు. పశువైద్య క్యాప్సూల్స్ రంగంలో ఏసీజీ లాబ్స్ సంస్థ చేసిన వినూత్నతలపై పరిశీలన, గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీసెస్, గుడ్ డాక్యుమెంటేషన్ ప్రాక్టీసెస్‌పై లోతైన వివరణ, క్యాప్సూల్స్, ఇతర ఫార్ములేషన్ల తయారీ దశలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం అధ్యాపక అధ్యాపకేతర బృందాన్ని అభినందించారు.

ఇంధన వనరులను పొదుపుగా వినియోగిద్దాం



ప్రత్తిపాడు: భావితరాల మనుగడ కోసం ఇంధన వనరులను పొదుపుగా వినియోగిద్దామని మండల విద్యాశాఖాధికారి కె.ఎఫ్ కెనడి పిలుపునిచ్చారు. కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎనర్జీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంధన వనరుల లభ్యత, నిర్వహణ మరియు ఇంధన వనరుల పొదుపుపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కెనడి మాట్లాడుతూ.. ఇంధనాన్ని పొదుపు చేయడం ఇంధన ఉత్పత్తితో సమానమన్నారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగాన్ని పెంచాలని.. ఆ దిశగా విద్యార్థులు నూతన ఆవిష్కరణలు రూపొందించేలా వినూత్న ఆలోచనలు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం.విజయభాస్కర్, ఉపాధ్యాయుడు బి.సత్యం విద్యార్థులు పాల్గొన్నారు.

కాలనీల్లో రాజ్యమేలుతున్న సమస్యలు

- కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు
- అంధకారంగా రహదారులు



టిడ్కో గృహాల వద్ద పెరిగిన పిచ్చి చెట్లు



వీధి దీపాలకు నోచుకోని టిడ్కో గృహాలకు వెళ్లే ప్రధాన రహదారి

పొన్నూరు: నిడుబ్రోలులోని టిడ్కో గృహాలు, జగనన్న కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. దీంతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ శివారు ప్రాంతంలోని ఈ కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారి అంధకారంగా ఉండడంతో రాత్రి వేళల్లో ఇళ్లకు వెళ్లాలంటే మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టిడ్కో గృహ సముదాయాల్లో మొత్తం 2,368 ఇళ్లకు గాను ప్రస్తుతం అనేక కుటుంబాలు అక్కడ జీవనం సాగిస్తున్నాయి. గృహ సముదాయాల్లో పిచ్చి చెట్లు విపరీతంగా పెరిగి చిట్టడవిని తలపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. పాములు, విష పురుగులు సంచరిస్తూ ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని అక్కడి వారు ఆందోళన చెందుతున్నారు. పిల్లలు చదువుకునేందుకు దూరంగా ఉన్న పొన్నూరుకు ఈ పరిస్థితులను దాటుకుని వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని అన్నారు. ప్రస్తుతం పట్టణంలో మున్సిపల్ అధికారులు స్వచ్ఛతా కార్యక్రమాలు చేపడుతున్నా.. టిడ్కో గృహాలు, జగనన్న కాలనీలను విస్మరించారనే ఆరోపణలు వినపడుతుంది.



జగనన్న కాలనీలో అధ్వానంగా రోడ్లు

అభివృద్ధికి ఆమడదూరంలో జగనన్న కాలనీ..

టిడ్కో గృహాల నుంచి వెళ్లే దారిలోనే ఉన్న జగనన్న కాలనీలో పలు సమస్యలతో స్థానికులు సతమతమవుతున్నారు. మొత్తం 4,685 నివాస స్థలాల్లో కొంతమంది ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. వీధి దీపాలు పూర్తిస్థాయిలో లేవని.. ఉన్నవి కూడా నామమాత్రంగా వెలుగుతున్నాయని.. దీంతో కాలనీ రాత్రి వేళల్లో అంధకారాన్ని తలపిస్తుందని స్థానికులు చెబుతున్నారు. చీకట్లో మందుబాబుల ఆగడాలతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువలు లేక పూడికతో నిండి దోమల వ్యాప్తి పెరుగుతుందని.. దీంతో రోగాల బారిన పడుతున్నామని అంటున్నారు. ఖాళీ స్థలాలు, వీధుల్లో పిచ్చిచెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా మారాయని అంటున్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు.

> **సమస్యలు పరిష్కరించాలి..**
>
> కాలనీలో వీధి దీపాలు పూర్తిస్థాయిలో వెలగడం లేదు. కొన్ని వెలిగినా వాటి నుంచి కాంతి రావడంలేదు. చీకట్లో మందుబాబులకు అంధకార దారులు అడ్డాగా మారాయి. వీధుల్లో పిచ్చి చెట్లు పెరగడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. మురుగు కాల్వలు లేక నీరు నిల్వ చేరుతుంది. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలి.
>
> – వెంకటేశ్వరమ్మ, జగనన్న కాలనీ, నిడుబ్రోలు

పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావాలి

ప్రత్తిపాడు: భవిష్యత్తును చూపించిన మన పాఠశాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు పూర్వ విద్యార్థులంతా కృషి చేయాలని పాఠశాల పూర్వ విద్యార్థి, ఎంఈవో ముద్దన శ్రీనివాసరావు అన్నారు. పెదనందిపాడు మండలం పాలపర్రులోని శ్రీ నారసింహ ప్రభుత్వ పాఠశాల 75వ వసంతంలోకి అడుగు పెడుతున్న నేపథ్యంలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మే 10, 11 తేదీల్లో పాఠశాలలో వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం స్థానిక పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వజ్రోత్సవ వేడుకలు పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందించేలా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 1950లో నెలకొల్పిన ప్రభుత్వ పాఠశాలకు పూర్వ వైభవం తీసురావడం కోసం పూర్వ విద్యార్థులందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. 1950 నుంచి ఇప్పటి వరకు 16 గ్రామాలకు చెందిన సుమారు 5,500 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యనభ్యసించి ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో దుద్దేంపూడి సత్యనారాయణ, పాఠశాల పీడీ ముద్దన సత్యనారాయణ, జంపని రామారావు, తేళ్ల ప్రభాకరరావు, పోపూరి రామచంద్రరావు, కమ్మ నాగ మల్లేశ్వరరావు, జంపని నాగేశ్వరరావు, శ్యాంసన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈవో ఎం.శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు

బ్యాంకు సేవలపై అవగాహన సదస్సు

పొన్నూరు: బ్యాంకుల ద్వారా అందించే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత మేనేజరు ఆర్.ఎస్. శంకరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీకృత గ్రామీణ గిరిజన అభివృద్ధి సేవా సంస్థ(ఆర్డీడ్స్) ఆర్బీఐ సంయుక్త ఆధ్వర్యంలో డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి ఆర్డీడ్స్ కార్యదర్శి వై.సాంబశివరావు అధ్యక్షత వహించారు. శంకరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఖాతాదారులకు నమ్మకమైన సేవలను అందిస్తుందని ఆయన అన్నారు. డీఆర్డీఏ ఏపీఎం జోజి బాబు మాట్లాడుతూ ప్రధానంగా బ్యాంకుల ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం ఉపాధి పొందే అవకాశాలను వివరించారు. రిసోర్స్ పర్సన్ యశ్వంత్ శ్రీనివాసరావు, మహిళలు, రైతులు, ఆర్డీడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శంకరరావు

బాలలే సమస్యలను గుర్తించాలి

పెదకాకాని: గుడ్ షెఫర్డ్ సేవా సంస్థ ఇన్‌చార్జి సిస్టర్ లతా ఆధ్వర్యంలో బాలల పార్లమెంట్ నిర్మాణ విధివిధానాలపై చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెదకాకాని సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ ప్రతినిధి జె.ఇశ్రాయెల్ మాట్లాడుతూ.. బాలలు వారి సమస్యలను గుర్తించి నెలవారీ జరిగే సమావేశంలో వాటిని చర్చించడమే బాలల పార్లమెంట్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. బాలల పార్లమెంటు ఏర్పాటు చేయటంతో బాలలకు చిన్నతనం నుంచే న్యాయకత్వ లక్షణాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.అనూష, సచివాలయ ఉద్యోగులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సంస్థ సిబ్బంది ఎస్.నాగమణి, ఎ.పోతురాజు, బి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సచివాలయం వద్ద ఉద్యోగులు, గుడ్ షెఫర్డ్ సంస్థ ప్రతినిధులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సీఐటీయు జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్

తెనాలిటౌన్: విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించవలసిన పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక చెంచుపేటలోని విద్యుత్ కార్యాలయంలో ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వి.చిరంజీవిని కలిసి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. కె.బాబుప్రసాద్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, షిఫ్ట్ ఆపరేటర్లు, వాచ్‌మేన్‌లకు సంవత్సరానికి 8 పెయిడ్ హాలిడేస్ ఉన్నాయని, ఆ పని దినాల్లో అదనంగా పనిచేసిన వారికి వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. వేలకోట్ల రూపాయిలు టర్న్ చేసే కంపెనీ చిన్నమొత్తాలను చెల్లించడంలో నిర్లక్ష్యం కనబరచడాన్ని తప్పుబట్టారు. తక్షణం నిధులు విడుదల చేసి కార్మికులకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి దాసరి వెంకటేశ్వరరావు, కాంట్రాక్ట్ వర్కర్స్‌యూనియన్ కార్యదర్శి ఎస్.నాగరాజు, గోపీనాథ్, సాంబశివరావు, దాసరి గోపి, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.



ఈఈ చిరంజీవికి వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘ నేతలు

చికిత్స పొందుతూ చెఫ్ మృతి

తెనాలిరూరల్: తోటి చెఫ్ బీరు సీసాతో చేసిన దాడిలో తీవ్రంగా గాయపడిన చెఫ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పట్టణ రైల్వేస్టేషన్ రోడ్డులోని హోటల్‌లో చెఫ్‌లుగా పని చేస్తున్న ఇద్దరు వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి దాటాక మద్యం తాగి ఘర్షణ పడడం, ఓ చెఫ్ మరో చెఫ్‌పై బీరు సీసాతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంగతి తెలిసిందే విజయవాడలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న విజయనగరంకు చెందిన భాస్కర్ (32) మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందింది.

నియోజకవర్గ నాయకులతో సమావేశం



గుంటూరు రూరల్: ఎవరికి కష్టం వచ్చినా అన్ని విధాలా అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఏటుకూరు బైపాస్ రోడ్డులో గల పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, స్థానిక సమస్యలపై స్పందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పీఎండీఎస్ కిట్లుతో బహుళ ప్రయోజనాలు



ప్రత్తిపాడు: పీఎండీఎస్ కిట్లుతో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయం గనికపూడి యూనిట్ ఇన్‌చార్జి కె.సుబ్బారావు అన్నారు. మండలంలోని పెదగొట్టిపాడు ఆది ఆంధ్ర కాలనీ వీవోలో మంగళవారం పీఎండీఎస్ (ప్రీ మాన్ సూన్ డ్రై సోయింగ్) కిట్లుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కిట్స్‌తో కలిగే ప్రయోజనాలు, భూసారం పెరుగుదల, భూమికి కావలసిన పోషకాలు అందడంలో కిట్లు ఎలా ఉపకరిస్తాయో రైతులు, మహిళలకు వివరించారు. కార్యక్రమంలో వీవోఏలు, ఓటీలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, రైతులు, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

నవధాన్యాలు సాగుతో లాభాలు

కొల్లిపర: ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రతి రైతు కొంత పంట భూముల్లో నవధాన్యాల సాగు చేయటం వలన లాభాలతో పాటు ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని ఐసీఆర్‌పీ ఝాన్సీ రోజా అన్నారు. మంగళవారం కొల్లిపర గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఖరీఫ్ యాక్షన్ ప్రణాళిక నవధాన్యాల సాగు విధానంపై ఎస్‌హెచ్‌జీ సభ్యు లుకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించడం వల్ల కలిగే లాభాలను వివరించారు. సాంబయ్య, గోపి, కోటేశ్వరరావు, ఓబులయ్య, సునీల్, సాగర్ పాల్గొన్నారు.

సేవానిరతి కలిగి ఉండాలి

గాంధీ హృదయదారి వజ్రాల రామలింగాచారి

తెనాలిటౌన్: ప్రతి ఒక్కరూ సేవానిరతిని కలిగి ఉండాలని గాంధీ హృదయదారి వజ్రాల రామలింగాచారి పిలుపునిచ్చారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో మంగళవారం కన్నెగంటి వీరంబశ్రీ హృదయసాయి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కన్నెగంటి రమేష్‌బాబు, శిరీష, కన్నెగంటి గోపిచంద్, పార్వతమ్మ, మదాల కోటేశ్వరరావు, విష్ణుంశెట్టి మాధవరావు, వెనిగళ్ళ ప్రసాద్, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, మణికుమార్, వెంకటస్వామి, ఉమాదేవి, భానుమూర్తి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దాతలు

దొంగల అలజడితో గ్రామస్తుల పహారా!

ప్రత్తిపాడు: ఊరికి రక్షణ గోడగా ఆ ఊరి ప్రజలు రాత్రంతా పహారా కాస్తున్నారు. అపరిచితులు గ్రామంలోకి ప్రవేశించకుండా తెల్లవారే వరకు కర్రలు పట్టుకుని గ్రామానికి రక్షణగా నిలుస్తున్నారు. వివరాల్లోనికి వెళితే.. పెదనందిపాడు మండలం పరిటాలవారిపాలెంలో గత కొద్ది రోజులుగా దొంగల అలజడి ఎక్కువైంది. దీంతో గ్రామస్తులు అప్రమత్తమయ్యారు. అందరూ కలిసి మాట్లాడుకుని రాత్రంతా మేల్కొని ఊరికి రక్షణగా నిలబడి కాపలాకాస్తున్నారు. ఊరంతా నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు గ్రామంలోకి ప్రవేశించి దొంగతనాలకు ప్రయత్నిస్తున్నారని వారు వాపోయారు. గతంలో జరిగిన దొంగతనాల దృశ్యా గ్రామస్తులు పోలీసులను కలిసి చోరీలను వివరించారు.



గ్రామంలో రక్షణగా అర్ధరాత్రి తిరుగుతున్న గ్రామస్తులు

ఉపాధ్యాయుడికి ఆత్మీయ సన్మానం

పెదకాకాని: మండలంలోని నంబూరు జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు వల్లభాపురం శౌరికి మంగళవారం ఇతర ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. గత సంవత్సరం పెదకాకాని మండలం హైస్కూల్ నుంచి డిప్యూటేషన్‌పై ఆయన ఇక్కడికి వచ్చారు. తిరిగి పెదకాకాని హైస్కూల్‌కు వెళుతున్నందున నంబూరు పాఠశాలలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. శౌరి గడచిన 8 నెలల కాలంలో స్కూలులోని విద్యార్థులకు ఇంగ్లీష్ బోధనలో నైపుణ్యాన్ని పెంపొందించి ఇంగ్లీష్ మాధ్యమంపై ఆసక్తిని కలిగించారన్నారు. విద్యార్థులకు బాలల దినోత్సవం, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి వంటి అనేక కార్యక్రమాలను నిర్వహించి బహుమతులను అందించి పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయిని వసుంధర దేవి అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

ఏబీసీ కేంద్ర నిర్మాణం పట్ల నిరసన

పెదకాకాని: కుక్కల కుటుంబ నియంత్రణ కేంద్ర నిర్మాణంపై మంగళవారం గ్రామ ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని పెదకాకాని తక్కెళ్లపాడు గ్రామాల మధ్య గుంటూరు కార్పొరేషన్ అధికారులు యానిమల్ బర్త్ కంట్రోల్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ భవన నిర్మాణంలో భాగంగా ఆ ప్రదేశంలోని పెద్ద చెట్లను తొలగించారు. ఏటుకూరు రోడ్డులోని ఏబీసీ కేంద్రాన్ని తక్కెళ్లపాడు శివారుకు మార్చడంతో చుట్టు పక్కల గ్రామాలకు కుక్కల వల్ల దుర్వాసన, వాటి బెడద ఎక్కువ కావడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయని నిరసన తెలిపారు. దీనిపై గత సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు కూడా చేశారు. చెట్లు నరకడంపై పెదకాకాని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ అక్కడికి చేరుకుని పరిశీలించారు.



చెట్లు తొలగింపును పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి ప్రసాద్

మరిచారా.. విడిచారా!

పొన్నూరు: నిడుబ్రోలులోని టిడ్కో గృహ సముదాయాల పరిసరాల్లో నిరుపయోగంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దర్శనమిస్తోంది. ఆ శాఖ అధికారులు మరిచారా.. లేక విడిచారా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. రూ.లక్షలు విలువ చేసే నూతన ట్రాన్స్‌ఫార్మర్ గత కొన్ని నెలలుగా మట్టిలో వృథాగా పడి ఉంది. టిడ్కో గృహాలకు వినియోగించేందుకు తీసుకువచ్చారని.. పలు కారణాలతో వినియోగానికి నోచుకోలేదని స్థానికులు చెబుతున్నారు. అయితే ఎలాంటి ప్రయోజనం లేకుండా పాడైపోతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించి ప్రజా ప్రయోజనాలకు వినియోగించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



టిడ్కో గృహాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

పొన్నూరు: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఏప్రిల్ 24వ తేదీన జరిగే సామూహిక రాయబార కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘం సి.ఐ.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మి నారాయణ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్లో భవన నిర్మాణ కార్మికులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ సంక్షేమ బోర్డుని పునరుద్ధరిస్తామని, పెండింగ్ క్లైమ్‌లు పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని అన్నారు. సంక్షేమ బోర్డు నుంచి సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికుల కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సి.ఐ.టి.యు మండల కార్యదర్శి ఎస్.రమేష్‌బాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న లక్ష్మి నారాయణ, కార్మికులు

చేబ్రోలు: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని.. ఏప్రిల్ 24న జరిగే సామూహిక రాయబార కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ హనుమంతరావు మంగళవారం కోరారు. చేబ్రోలులోని కొత్తరెడ్డిపాలెంలో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల ముందు చంద్రబాబు, లోకేష్‌లు భవన సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తాం అని ఇచ్చిన హామీలను గుర్తుచేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ మండల అధ్యక్షుడు చైడయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెంగళాయపాలెం టీడీపీలో అంతర్గత విభేదాలు

- రెండు గ్రూపులుగా ఏర్పడి అర్ధరాత్రి దాడులకు యత్నం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వైనం

గుంటూరు రూరల్: టీడీపీలో అంతర్గత విభేదాలు గ్రామాల్లోని ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో రెండు వర్గాల మధ్య ఏర్పడిన చిన్నపాటి వివాదాలు రెండు వర్గాలుగా ఏర్పడి దాడులు చేసుకునే స్థాయికి చేరాయి. అధికార పార్టీలో ఏర్పడిన వివాదాలు, అదే విధంగా ప్రభుత్వ భూముల ఆక్రమణ, రియల్ ఎస్టేట్ వసూళ్లు తదితర విషయాలపై ఏర్పడిన వివాదాలు తారా స్థాయికి చేరుకున్నాయి. ఒక వర్గం స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నడుస్తుండగా మరో వర్గం ఎంపీ వద్ద నడుస్తూ ఉంది. ఈ క్రమంలో రెండు వర్గాల మధ్య గత ఆదివారం ఒక వర్గం మరో వర్గంలోని వ్యక్తిపై దాడికి ప్రయత్నించారు. దీంతో సోమవారం మరో వర్గం దాడికి ప్రయత్నించిన వారిపై పక్క గ్రామాల నుంచి సుమారు 50 మంది యువకులను పిలిపించి దాడులకు ప్రయత్నించారు. దీంతో పోలీసులకు సమాచారం తెలిసి సంఘటనా స్థలికి చేరుకుని దాడులకు ప్రయత్నించిన ఒక వర్గాన్ని అక్కడి నుంచి పంపేశారు. పోలీసులు కలుగజేసుకుని ఇరువర్గాలను అదుపుచేశారు.